నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 11 జూన్ 2025 | KARIMNAGAR



శ్రీ రాజరాజేశ్వర రిజర్వాయర్ కట్టపై కేసీఆర్ కటౌట్‌కు పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చే కుట్ర

- ఆయనకు నోటీసులివ్వడం ఓర్వలేనితనమే
- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు
- మిడ్ మానేరు వద్ద కేసీఆర్ కటౌట్‌కు పాలాభిషేకం

ఇల్లంతకుంట, జూన్ 10 : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్షగట్టి, ఆయన ప్రతిష్టను దిగజార్చాలనే కుట్రతోనే సీఎం రేవంత్‌రెడ్డి నోటీసులు ఇప్పించారని, ఇది రాక్షస ఆనందమేనని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామ శివారులోని శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) రిజర్వాయర్ కట్టపై బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ కటౌట్‌కు బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని బీడు భూములను కాళేశ్వరం నీటితో పచ్చని పంట పొలాలుగా మార్చిన కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ ఓర్వలేనితనమేనని మండిపడ్డారు. రాష్ట్రంలో లక్షల ఎకరాలకు సాగు నీరు అందించి రైతులను రాజులను చేయడానికి కేసీఆర్ చేసిన కష్టాన్ని ఎవరూ మరిచిపోరని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం పల్లె నర్సింహారెడ్డి మాట్లాడుతూ, నెర్రెలు బారిన నేలలో పసిడి పంటలు పండించే రాష్ట్రంగా మార్చినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా..? అని నిలదీశారు. మండుటెండల్లోనూ గ్రామాల్లో వాగులు వంకలు పొంగి పొర్లి గ్రామాల్లో చెరువులు, కుంటలు మత్తడులు దుంకించినందుకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై అసత్య ప్రచారాలు చేస్తూ కాలం గడపడమే తప్ప రెండేళ్ల కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రోండ్ల తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు సిద్ధం శ్రీనివాస్, కమటం రాములు, మధు, ఉడుతల వెంకన్న, మాజీ ఎంపీటీసీ పరశురాం, నాయకులు కేవీఎన్ రెడ్డి, తూటి పరశురాం, శ్రీనివాస్, అనిల్, రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 10 : 2025-26 సంవత్సరానికి అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడేళ్ల శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు పవన్‌కుమార్ తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల న్యాయశాస్త్ర పట్టభద్రులు జూలై 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఔత్సాహికులు http://telanganaepass.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో కులం, ఆదాయం, న్యాయశాస్త్ర, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పాసు పుస్తకం జిరాక్స్ ప్రతులు జత పరిచాలని సూచించారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికి ₹3వేల ఉపకార వేతనంతోపాటు పుస్తకాలు, ఇతర సామగ్రి కొనుగోలు కోసం ₹50వేలు మంజూరు చేస్తామని చెప్పారు. పూర్తి వివరాల కోసం ఆయా జిల్లాల్లోని సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

# కొత్త కార్డు వచ్చినా.. రేషన్ రాకపాయే!

- గత నెల నాటికి నమోదైన కార్డులకే రేషన్ విడుదల
- ఆ తర్వాత అప్రూవ్ అయిన వాటికి అందని బియ్యం
- మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తున్న నేపథ్యంలో అయోమయం
- వచ్చే నెల అయినా ఇస్తారో.. లేదోనని అనుమానాలు
- సుమారు 3వేలకుపైగా కొత్త కార్డుదారుల ఎదురుచూపులు
- ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో నిరాశ



కరీంనగరంలోని ఓ రేషన్‌దుకాణంలో బియ్యం తీసుకుంటున్న ప్రజలు





..పక్క ఫొటోలో రేషన్ కార్డు చూపుతున్నది పుట్టపాక శ్రీకాంత్. హుజూరాబాద్ మండలంలోని ఇప్పల నర్సింగాపూర్. ఆ యువకుడికి మూడేళ్ల క్రితం పెళ్లి కాగా, ఇద్దరు పిల్లలు జన్మించారు. ఇన్నాళ్లూ ఉమ్మడి కుటుంబంలో ఉండగా, రేషన్ కార్డు తల్లిదండ్రులతోనే ఉన్నది. ఉమ్మడిగా ఉన్న కార్డులో తన పేరు తొలగించుకొని, కొత్త రేషన్‌కార్డు కోసం గత నెల 15న దరఖాస్తు చేసుకున్నాడు. అయితే మే 25 తర్వాత కొత్తగా రేషన్‌కార్డు మంజూరైంది. శ్రీకాంత్ కార్డుతో తనకు కేటాయించిన షాపులోకి వెళ్లాడు. మూడు నెలల రేషన్ కోసం డీలర్‌ను అడిగితే.. 'కార్డు వచ్చింది.. కానీ రేషన్ మంజూరు కాలేదు' అని చెప్పడంతో కంగుతిన్నాడు. ఇదేంటని ప్రశ్నిస్తే గత నెల 20వ తేదీకి ముందు ఉన్న కార్డులకు మాత్రమే బియ్యం కోటా కేటాయిస్తారని చెప్పడంతో నిరాశ చెందాడు. ఈనెల రాకపోయినా పర్వాలేదు, వచ్చే నెలలో అయినా ఇస్తారా..? అని అడిగాడు. తనకు తెలియదని డీలర్ చెప్పడంతో.. 'కార్డు వచ్చినా.. రేషన్ రాకపాయే' అంటూ ఉసూరుమంటూ వెనుదిరిగాడు. ఇది ఒక్క పుట్టపాక శ్రీకాంత్ బాధ మాత్రమే కాదు.. ఉమ్మడి జిల్లాలో కొత్తగా రేషన్‌కార్డులు మంజూరైన వేలాది మందిది ఇలాంటి పరిస్థితే.

హుజూరాబాద్/ కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 10 : రేషన్‌కార్డుదారులకు బియ్యం సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రతినెలా 20న లబ్ధిదారుల వివరాలతో కూడిన ఇండెంట్ పంపుతారు. అందులో గత లబ్ధిదారులతోపాటు ఆ తేదీలోగా కొత్తగా కార్డులు మంజూరైన వారి వివరాలు కూడా పంపిస్తారు. అదే విధానంలో గత నెల కూడా అన్ని జిల్లాల నుంచి ఇండెంట్ పంపారు. ప్రస్తుతం ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించిన ఒకేసారి పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ఆ మేరకు రేషన్ సరుకులు వచ్చాయి. కరీంనగర్ జిల్లాలో చూస్తే.. 2,90,402 కార్డుల పేర 8,79,888 మందికి ఒక్కొక్కరికి 18 కిలోల చొప్పున మూడు నెలల కోటా కింద 16,748.667 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం విడుదలయ్యాయి. కానీ, గత నెల 20వ తేదీ తర్వాత నమోదైన కార్డులకు సంబంధించి రేషన్ విడుదల కాలేదు. కరీంనగర్ జిల్లాలో కొత్త కార్డులు సుమారు వెయ్యి వరకు ఉండగా, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3వేల నుంచి 4వేల వరకు ఉన్నట్టు తెలుస్తున్నది. అయితే ఈ కొత్త కార్డుదారులకు బియ్యం విడుదలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదు. అధికారులు కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో కొత్త రేషన్‌కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండగా, తమకు వస్తయా.. రావోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కార్డులు వచ్చినా ఏం సంబురం లేదని నిరాశ చెందుతున్నారు. ఈ నెలలో తప్పినా.. జూలై, ఆగస్టు నెలల కోటా అయిన తమకు విడుదల చేయాలని కోరుతున్నారు. ఎప్పటిమాదిరిగానే ప్రతి నెలా 20లోగా పెట్టే ఇండెంట్‌లో గత నెల 21 నుంచి అప్రూవ్ అయిన కార్డులకు ఈ నెలలో బియ్యం కోటా విడుదలయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.



## కొత్త కార్డు ఇచ్చి ఏం లాభం?

నేను నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నా. పోయిన నెలలో కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా వచ్చింది. దానిని పట్టుకుని రేషన్ డీలర్ వద్ద కెళ్లి బియ్యం ఇయ్యాలని అడిగిన. ఆయన పంపిణీ జాబితాలో నీ పేరు లేదని చెప్పాడు. నాకు మంజూరైన కార్డును చూపితే 'పోయిన నెల 20 తర్వాత నీకు కార్డు వచ్చింది. అందుకే ప్రభుత్వం నీకు బియ్యం కోటా కేటాయించలేద'ని చెప్పిండు. ఈ నెల కాకపోయినా, వచ్చే నెలలో అయినా వస్తాయా.. రావా? చెప్పు అని అడిగితే 'నాకు తెల్వదు. అధికారులను అడుగు' అంటున్నడు. మూడు నెలల బియ్యం రాకపోతే కొత్త కార్డు ఇచ్చి ఏం లాభం? అధికారులు పట్టించుకోవాలి. కొత్త కార్డుదారులకు బియ్యం ఇవ్వాలి.

- పుట్టపాక రమేశ్,
ఇప్పల నర్సింగాపూర్
(హుజూరాబాద్ మండలం)

## వచ్చే నెల విడుదలయ్యే అవకాశం ఉన్నది

రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ. ప్రతి నెలా 20 లోగా అప్రూవ్ అయిన కార్డులకు మాత్రమే బియ్యం కోటా కేటాయిస్తారు. ఆ తర్వాత అప్రూవ్ అయిన వాటికి వచ్చే నెలలో బియ్యం విడుదలవుతాయి. ఇదేవిధంగా మే 20లోగా మంజూరైన కార్డులకు కూడా రేషన్ కోటా విడుదలైంది. ఆ తర్వాత మంజూరైన వారికి బియ్యం కేటాయింపుపై ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వీరికి జూలై, ఆగస్టు నెలల కోటా విడుదలయ్యే అవకాశాలున్నాయి.

- నర్సింగారావు,
డీఎస్‌వో (కరీంనగర్)
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి



చనిపోయిన గొర్రెల వద్ద కాపలాదారులు

# కరెంట్ షాక్‌కు మూగజీవాలు బలి

- 40 గొర్రెలు మృత్యువాత.. మరో 30 జీవాలకు అస్వస్థత
- కటికనపల్లి శివారులోని ఇన్సులేటర్ పగిలి విద్యుత్ సరఫరా
- గొర్రెలు ఒర్రెలో నీళ్లు తాగుతుండగా ప్రమాదం
- సుమారు ₹6 లక్షల వరకు నష్టం

ధర్మారం, జూన్10: కరెంట్ షాక్‌కు మూగజీవాలు బలయ్యాయి. ఒర్రెలో నీళ్లు తాగుతుండగా విద్యుత్ షాక్ రావడంతో 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఇది చూసిన గొర్రెల కాపరులు కన్నీరుమున్నీరయ్యారు. చనిపోయిన గొర్రెలకు పరిహారం అందించాలని వేడుకున్నారు. గొర్రెల కాపరుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం చామనపల్లి గ్రామానికి చెందిన దాడి ఓదెలు, దాడి ఐలయ్య, నిట్టు ముజ్జయ్య, కడారి కొమురయ్య, నిట్టు లచ్చయ్య, ఆవుల భూమయ్య, బైర రాయలింగు, నిట్టు రాజు, నిట్టు మల్లయ్య, కొమ్మ లచ్చయ్యకు చెందిన సుమారు 700 గొర్రెలు మంగళవారం కటికనపల్లి గ్రామ శివారులో మేతకు వెళ్లాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సున్నం మాటు ఒర్రె మీదుగా ఏడుగురు గొర్ల కాపలాదారులు మందను దాటిస్తున్నారు. అయితే ఆ ఒర్రె వద్ద కొన్నేళ్ల నాటి పాత 11 కేవీ విద్యుత్ స్తంభానికి తీగ మొక్కలు అల్లుకొని ఉండడంతో ఆకస్మాత్తుగా స్తంభంపై ఉన్న ఇన్సులేటర్ (పింగాణి పరికరం) పగిలి ఇనుప చువ్వలకు తాకింది. దీంతో స్తంభంపై నుంచి భూమి వరకు ఉన్న ఇనుప చువ్వల ద్వారా విద్యుత్ సరఫరా అయింది. పచ్చటి చెట్ల పొదలు అంటుకొని మంటలు వ్యాపించి, సమీపంలోనే ఒర్రెలోని నీటికి కరెంట్ సరఫరా అయింది. ఆ సమయంలో వంద గొర్రెల వరకు ఒర్రెలో నీరు తాగుతుండగా షాక్ తగిలి, 40 మూగజీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 30 గొర్రెలు తీవ్ర అస్వస్థత చెందాయి. అప్పటికే అప్రమత్తం కావడంతో గొర్రెల పెంపకందారులకు ప్రమాదం తప్పింది. మందను ఒర్రెలోకి వెళ్లకుండా మళ్లించడంతో మిగతా వాటికి ప్రాణాపాయం తప్పింది. లేదంటే పెద్ద సంఖ్యలో గొర్రెల ప్రాణాలు గాలిలో కలిసేవి. గొర్రెల మృతితో కాపరులు కన్నీరుమున్నీరయ్యారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే మూగజీవాలు మరణించాయని ఆగ్రహించారు. సుమారు ₹6లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. సంఘటనా స్థలాన్ని ధర్మారం ఎన్పీడీసీఎల్ ఏడీఈ విజయ్ గోపాల్ సింగ్, ధర్మారం ఏఈ ఎండీ ఖాసిం పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఎన్పీడీసీఎల్ తరపున మూగజీవాలకు పరిహారం అందించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఆర్ఐ -1 వరలక్ష్మి, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల నాగరాజు, గొర్రెల కాపరుల సొసైటీ మండలాధ్యక్షుడు జంగ మహేందర్, దొంగతుర్తి మాజీ ఎంపీటీసీ దాడి సదయ్య కాపరులను పరామర్శించారు.

## నేను అతడితోనే ఉంటా..

# నువ్వు సచ్చిపో..

- అవమానించిన భార్య
- మనస్తాపంతో భర్త ఆత్మహత్య

బోయినపల్లి రూరల్, జూన్ 10 : ''నువ్వు సచ్చిపో.. నేను అతడితోనే ఉంటా'' అని భార్య అవమానించడంతో ఓ భర్త వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ రాజ్ కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తడగొండకు చెందిన కుంటాల హరీశ్(36)కు 2014లో కావేరితో వివాహం జరిగింది. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. అయితే, కుటుంబ పోషణ, తన ఇద్దరు పిల్లల భవిష్యత్ కోసం హరీశ్ గల్ఫ్‌కు వెళ్లాడు. ఈ సమయంలో కావేరి అదే గ్రామానికి చెందిన మన్నె రక్షణ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకున్నది. రెండు రోజుల క్రితం హరీశ్ ఇంటికి రాగా, భార్య వివాహేతర సంబంధం విషయం తెలిసింది. దీంతో ఆమెను నిలదీయడంతో 'నేను రక్షణ్‌తోనే ఉంటా.. నువ్వు సచ్చిపో'' అని అన్నది. దీంతో తీవ్ర అవమానానికి గురైన హరీశ్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. హరీశ్ తల్లి కుంటాల ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# విలీన గ్రామాలు అస్తవ్యస్తం

- వార్డు కార్యాలయాలు తెరిచేది ఎప్పుడో
- అందుబాటులో లేని అధికారులు
- సమస్యలు వినేవారు కరువు
- అవస్థలు పడుతున్న నగర ప్రజానీకం



దుర్శేడ్‌లో మూసి ఉన్న వార్డు కార్యాలయం

కరీంనగర్‌లో ఇటీవల విలీనమైన గ్రామాల పరిస్థితి అధ్వానంగా మారింది. కార్పొరేషన్‌లో కలిస్తే సౌకర్యాలు, సదుపాయాలు మెరుగు పడుతాయనుకుంటే కనీసం తమ సమస్యలు ఎక్కడ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉన్నది. వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసినా అవి ఎప్పుడు తెరుచుకుంటాయో..? అధికారులు ఎప్పుడు వస్తారో.. తెలియడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడాల్సి వస్తున్నది.

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 10 : కరీంనగర్ కార్పొరేషన్‌లో కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్, మల్కాపూర్, చింతకుంట గ్రామాలను నాలుగు నెలల క్రితమే విలీనం చేశారు. తర్వాత ఆయా గ్రామాల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకొని, పంచాయతీ కార్యాలయాలకు వార్డు కార్యాలయాలంటూ బోర్డులు పెట్టారు. నగరంలో 60 డివిజన్లకు 60 మంది వార్డు ఆఫీసర్లను నియమించడంతోపాటు విలీన గ్రామాల్లోనూ వార్డు ఆఫీసర్లను నియమించారు. కొత్తపల్లి మున్సిపాలిటీలో రెండు వార్డులుగా విభజించి ఇద్దరు వార్డు ఆఫీసర్లను.. మిగిలిన గ్రామాలకు ఒక్కొక్కరి చొప్పున నియమించారు. వీరికి తోడు ప్రతి ఒక్కరికి అసిస్టెంట్లను కూడా కేటాయించారు. మూడు నెలల కిత్రమే వార్డు ఆఫీసర్లను నియమించగా, మళ్లీ ఇటీవల వార్డు ఆఫీసర్ల డివిజన్లను మార్పులు చేర్పులు చేశారు. దీంతో అసలు తమకు ఏ ఆఫీసర్ ఉన్నాడో.. తెలియని పరిస్థితి విలీన గ్రామాల్లో కనిపిస్తున్నది. మరోవైపు విలీన గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా, ఇతర సమస్యలపై కనీసం పట్టించుకునే నాథుడు లేడు. స్థానికంగా ఉన్న సమస్యలను వార్డు ఆఫీసర్లు చూసుకుంటారని నగరపాలక ఉన్నతాధికారులు చెబుతుంటే, అసలు తమకేమీ తెలియదన్నట్టు వార్డు ఆఫీసర్లు వ్యవహరిస్తున్నట్టు తెలుస్తున్నది.

### ఏ సమస్యలైనా నగర కార్యాలయానికే..

గ్రామాలు, మున్సిపాలిటీ విలీనంతో నగరం విస్తరించగా.. అధికారులు మాత్రం విస్తరించిన నగరానికి అనుకూలంగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. విలీన గ్రామాల్లో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేశామని చెబుతున్నా, అక్కడ కనీసం సిబ్బంది కూడా లేకపోవడంతో అవి మూసి ఉంటున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. విలీన గ్రామాల ప్రజలు ఏ సమస్యలు విన్నవించాలన్నా నగరంలోని బల్దియా కార్యాలయానికే రావాల్సి వస్తున్నది. తీరా ఇక్కడికి వచ్చాక తమ సమస్యలను ఏ అధికారికి చెప్పాలో తెలియక మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందించేందుకు ఎదురుచూడాల్సి వస్తుందని విలీన గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



విలీన గ్రామంలో పేరుకపోయిన చెత్త

### కార్యాలయం ఉన్నా పనిచేయడం లేదు



గ్రామంగా ఉన్నప్పుడు పంచాయతీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఉండే వారు. నగరంలో కలిసిన తర్వాత ఏ పని చెప్పినా కావడం లేదు. ఇప్పుడు పారిశుధ్య, వీధిదీపాలు, నీటి సరఫరా సమస్యలను ఎవరికి చెప్పినా తమ పరిధిలోకి రాదంటూ తప్పించుకుంటున్నరు. స్థానికంగా ఉండే సిబ్బంది కూడా ఎవరి పర్యవేక్షణలో పని చేస్తున్నరో తెలియడం లేదు. ఏ విషయమైనా నగర కార్యాలయంలోనే చెప్పుకోవాలి అన్నట్టున్నది. ప్రతి పనికి అక్కడికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉన్నది. పంచాయతీ కార్యాలయం ఉన్నా అది ఎందుకూ పని చేయడం లేదు.

- సంపత్‌రావు, మాజీ ఉపసర్పంచ్ (దుర్శేడ్)

### పట్టించుకునే దిక్కు లేదు



నగరపాలక సంస్థలో విలీనమైన తర్వాత గ్రామాన్ని పట్టించుకునే నాథుడు లేడు. వార్డు ఆఫీసర్ ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో.. తెలియడం లేదు. కనీసం ప్రజలు కార్యాలయానికి వెళ్లి తమ సమస్యను చెప్పుదామన్నా ఎప్పుడూ మూసే ఉంటుంది. పారిశుధ్యం, నీటి సరఫరా పనులపై పర్యవేక్షణ లేక అధ్వానంగా మారుతున్నది. ఏదైనా సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోతే తమ పరిధి కాదంటున్నారు. దీనికి తోడు రెండు, మూడు నెలలకే అధికారులను మార్చడంతో ఇబ్బందిగా మారుతున్నది.

- తిరుపతినాయక్, మాజీ ఎంపీటీసీ (చింతకుంట)

# సహస్రకు ఉచిత ఆపరేషన్



హైదరాబాద్ రెయిన్‌బో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సహస్ర

- 'నమస్తే' కథనానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి స్పందన
- ఉచిత వైద్యం అందించాలని ఆదేశాలు
- హైదరాబాద్ రెయిన్‌బో హాస్పిటల్‌లో సర్జరీ
- కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

పాలకుర్తి, జూన్10 : రోడ్డు ప్రమాదంలో అమ్మానాన్నను కోల్పోయి, తీవ్రంగా గాయపడిన నాలుగేళ్ల చిన్నారి సహస్రకు ఉచిత వైద్యం అందింది. 'నమస్తే' కథనానికి ప్రభుత్వం స్పందించి, పూర్తి ఉచితంగా ఆపరేషన్ చేయించింది. పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌కు చెందిన గుంటిపెల్లి రాము, అనుష దంపతులు ఈ నెల 5న సుల్తానాబాద్ వద్ద రోడ్డుప్రమాదంలో మృతిచెందగా, నాలుగేళ్ల కూతురు సహస్ర తీవ్రగాయాలతో బయటపడింది. కానీ, గ్రేడేడ్ స్పైనల్ కార్డు దెబ్బతిని ఐసీయూకే పరిమితమైంది. సర్జరీకి సుమారు ₹10 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో పేద కుటుంబానికి చెందిన నానమ్మ తల్లడిల్లిపోయింది. సాయం కోసం మానవతావాదులను అర్థించింది. ఈ విషయం తెలుసుకున్న 'నమస్తేతెలంగాణ' చిన్నారి పరిస్థితిపై 'సహస్రను ఆదుకోండి' శీర్షికన మంగళవారం మానవీయ కథనం ప్రచురించింది. ఈ కథనం చూసిన రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదరరాజనర్సింహ స్పందించారు. వెంటనే ఉచిత వైద్యం కోసం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైద్యాధికారులు కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న సహస్రను ఉదయమే హైదరాబాద్‌లోని రెయిన్‌బో హాస్పటల్‌కు తరలించారు. మధ్యాహ్న సమయంలో పూర్తి ఉచితంగా ఆపరేషన్ చేశారు. సర్జరీ విజయవంతమైందని వైద్యులు తెలిపారు. దీంతో నానమ్మతోపాటు బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వంతోపాటు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, 'నమస్తే తెలంగాణ' పత్రికలో వచ్చిన కథనానికి స్పందిస్తున్నట్టు జే వెంకటి, ఎంబీబీఎస్ డీజీవో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి హైదరాబాద్ నుంచి లేఖను విడుదల చేశారు.

